సాక్షి
కాకినాడ
ఆదివారం । 17 । నవంబర్ । 2024



రూ.1,11,116 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని నిత్యాన్నదాన ట్రస్టుకు కొప్పిశెట్టి వెంకట రమణ, కుటుంబ సభ్యులు (కాకినాడ) శనివారం రూ.1,11,116 విరాళం సమర్పించారు.



చర్చి, పాకల కూల్చివేత

కూటమి సర్కారు అరాచక పాలన సాగిస్తుంది. రాజుపాలెంలో చర్చి, మూడు పాకలను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం విమర్శలకు తావిచ్చింది.

8లో

17 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 17,382 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువకు వెయ్యి క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పవిత్ర కార్తిక మాసం.. అందునా స్వామివారికి ప్రీతికరమైన శనివారం కావడంతో వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పూలమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవలు, కేశఖండన టికెట్లు, అన్నదానం విరాళాల ద్వారా దేవస్థానానికి రూ.3,59,240 ఆదాయం సమకూరిందని ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. 7,500 మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

రత్నగిరి కిటకిట



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి శనివారం కిటకిటలాడింది. సాయంత్రం నాలుగు గంటల వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. వ్రతాలు 4,800 జరిగాయి. స్వామివారి నిత్య కల్యాణంలో రూ.1,116 చొప్పున టికెట్లు కొనుగోలు చేసి 27 మంది భక్తులు పాల్గొన్నారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. సుమారు 6 వేల మంది భక్తులకు పులిహోర, దద్ధోజనం పంపిణీ చేశారు.

నేడు, రేపు కొనసాగనున్న రద్దీ!

రత్నగిరిపై ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. ఈ రెండు రోజులూ సుమారు 15 వేల వ్రతాలు జరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. సుమారు 50 వేల నుంచి 75 వేల మంది వరకూ భక్తులు వచ్చే అవకాశం ఉందనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. తెల్లవారుజామున 2 గంటల నుంచే వ్రతాలు, స్వామివారి దర్శనాలు ప్రారంభించనున్నారు. అన్ని మండపాల్లో ఏక కాలంలో 1,500 మంది వ్రతాలు ఆచరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

గిరి ప్రదక్షిణ రోడ్డుపై రాళ్లు లేకుండా చర్యలు



ఈఓను అభినందిస్తున్న దేవస్థానం సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: వచ్చే ఏడాది నుంచి సత్యదేవుని గిరి ప్రదక్షిణ సాగే పుష్కర రోడ్డుపై ఎటువంటి రాళ్లు లేకుండా పూర్తిగా ఏరివేయించాలని అన్నవరం దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. ఆ రోడ్డుపై మెత్తటి గ్రావెల్ వేయించి, రోలర్‌తో చదును చేయించాలని సూచించారు. 'గిరులు..తరులు...భక్తజన సిరులు' శీర్షికన శనివారం ప్రచురించిన సత్యదేవుని గిరి ప్రదక్షిణ వార్తలో పుష్కర రోడ్డులో రాళ్లు లేచిపోవడంతో భక్తులు పడిన ఇబ్బందులను 'సాక్షి' వెలుగులోకి తీసుకుని వచ్చింది. దీనిపై స్పందించిన ఈఓ పై విధంగా ఆదేశాలు జారీ చేశారు. గిరి ప్రదక్షిణ రోడ్డులో ఏర్పాటు చేసిన తాత్కాలిక టాయిలెట్లు భక్తులకు సరిపోలేదని, వచ్చే ఏడాది వీటిని 40 చోట్ల ఏర్పాటు చేసి, వాటి వద్ద ఎక్కువ డ్రమ్ముల తో నీళ్లు ఉంచాలని ఈఈ రామకృష్ణ, డీఈ రాంబాబును ఆదేశించారు. కాగా, లక్షల మంది భక్తులు వచ్చినప్పటికీ శుక్రవారం జరిగిన సత్యదేవుని గిరి ప్రదక్షిణ విజయవంతం కావడంతో ఈఓను సిబ్బంది అభినందించారు. ఉదయం గిరి ప్రదక్షిణ జరిగితే సుమారు మూడు గంటల పాటు భక్తులు కొండ మీదకు వెళ్లడానికి, కిందకు రావడానికి వీలుండేది కాదని ఈఓ రామచంద్ర మోహన్ అన్నారు. అలాగే, భక్తుల వాహనాలు అన్నవరం గ్రామంలోకి వచ్చే అవకాశం ఉండేది కాదన్నారు. ఈ పరిస్థితిని నివారించడానికే మధ్యాహ్నం రెండు గంటలకు గిరి ప్రదక్షిణ పెట్టామని తెలిపారు. దేవస్థానం సిబ్బంది, పోలీసులు, సేవా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు సహకారంతో గిరి ప్రదక్షిణ విజయవంతమైందని అన్నారు.

మూఢనమ్మకాలతో ముప్పు



- మూర్ఛతో అకాల మరణం సంభవించే ప్రమాదం
- సకాలంలో వైద్యం చేయించకుంటే ప్రాణాపాయం
- నేడు జాతీయ మూర్ఛ వ్యాధి నివారణ దినోత్సవం

కాకినాడ క్రైం: అప్పటి వరకూ చలాకీగా ఉన్న వ్యక్తి ఉన్నట్టుండి కుప్పకూలిపోయిన సందర్భాలు ఎప్పుడైనా చూశారా! అలా కింద పడిపోయి కొట్టుకోవడం, కాళ్లు చేతులు బిగుతుగా మారడం జరిగితే అది ముమ్మాటికీ మూర్ఛే. ఇది మెదడుకు సంబంధించిన ఓ దీర్ఘకాలిక వ్యాధి. దీనినే వాడుక భాషలో ఫిట్స్ అని, వైద్య పరిభాషలో ఎపిలెప్సీ అని అంటారు. నరాల కణాల్లో సంకేతాలు లోపించడం వల్ల ఈ స్థితి సంభవిస్తుంది. దెబ్బ తిన్న మెదడు కణాలే మూర్ఛ ముప్పును తీసుకొస్తాయి. మెదడులో అనియంత్రిత విద్యుత్ విస్ఫోటనాలు మూర్ఛకు దారి తీస్తాయి. వయో భేదం లేకుండా ఈ వ్యాధి ఎవరికైనా రావచ్చు.

నియంత్రణే.. నివారణ లేదు

మూర్ఛ నివారణ లేని వ్యాధి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను అనుసరించి దీనిని కేవలం నియంత్రించవచ్చు. ఈ నియంత్రణపై తగిన నిర్వహణ లేకపోతే ఒక్కోసారి మరణించే పరిస్థితి ఏర్పడుతుంది. సాధారణ ప్రజలతో పోలిస్తే మూర్ఛ రోగుల్లో అకాల మరణం సంభవించే అవకాశం 4 రెట్లు అధికమని కాకినాడకు చెందిన ప్రముఖ న్యూరాలజీ నిపుణుడు డాక్టర్ ఆర్.గౌతమ్ ప్రవీణ్ తెలిపారు.

కారణాల కోసం అన్వేషణ

వైద్య శాస్త్రానికే సవాలుగా మారిన మూర్ఛ వ్యాధికి స్పష్టమైన కారణాలేమిటో ఇప్పటికీ తెలియవు. శరీరంలో అప్పటికప్పుడు చోటు చేసుకుంటున్న అసాధారణ మార్పులను అనుసరించి మాత్రమే వైద్యం అందించగలుగుతున్నారు. కారణాలు తెలియకపోవడం వల్ల ఈ వ్యాధిని పూర్తిగా నియంత్రించే అవకాశం లేకుండా పోయింది. అయితే తక్కువ బరువుతో జన్మించడం, ప్రసవం వేళ మెదడుకు తగిన స్థాయిలో ఆక్సిజన్ అందకపోవడం, జన్యుపరమైన సమస్యలు, మెదడుకు చేరే ఆక్సిజన్‌ను అడ్డుకునే స్ట్రోక్, తలకు తీవ్రమైన గాయం, మెదడులో కణుతులు, మెదడు ఇన్ఫెక్షన్లు, కుటుంబ చరిత్ర, డిమెన్షియా, బాల్యంలో మూర్ఛ చరిత్ర వంటి కారణాలు ఈ వ్యాధికి దారి తీయవచ్చని ఓ అంచనాకు రాగలిగారు. వ్యాధి కారణాలను కనుగొనేందుకు ఇప్పటికీ పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి.

ఇలా గుర్తిస్తారు

సాధారణ రక్త పరీక్షలు, ఎంఆర్‌ఐ, పీఈటీ, ఈఈజీ, సీటీ స్కాన్, న్యూరో సైకలాజికల్ టెస్ట్, న్యూరోలాజికల్ టెస్ట్‌ల ద్వారా ఈ వ్యాధిని వైద్యులు నిర్ధారిస్తారు.

మూఢ విశ్వాసాలతో ప్రాణాలకే ప్రమాదం

మూర్ఛ రోగులకు సకాలంలో చికిత్స చేయించకుండా, మూఢనమ్మకాలతో చిట్కాలు పాటిస్తే ప్రాణాలకే ప్రమాదం వాటిల్లవచ్చు. ఫిట్స్‌తో బాధ పడుతున్న వారి చేతుల్లో చాలా మంది తాళాల గుత్తి పెడుతూంటారు. దీనివలన ఫిట్స్ తగ్గవు. అలాగే, భూతవైద్యాలు, చురకలు వేయించడం ఏమాత్రం మంచిది కాదు. మూర్ఛతో రోగి కింద పడి కొట్టుకుంటూంటే ఇప్పటికీ దెయ్యం పట్టిందనే మూఢవిశ్వాసం చాలా మందిలో ఉంది. ఇది సరి కాదు. బాధితుడిని విశ్రాంతిగా వదిలేస్తే గరిష్ఠంగా మూడు నిమిషాల వ్యవధిలో ఫిట్స్ తగ్గిపోతాయి. అంతే తప్ప ఏ తాళాలు, మంత్రాలు ఫిట్స్‌ను నియంత్రించవు.

అవగాహన కార్యక్రమాలు

ఆదివారం జాతీయ మూర్ఛ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా కాకినాడ జీజీహెచ్‌లో న్యూరో మెడిసిన్ విభాగం ఆధ్వర్యాన శనివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కోరుకొండ బాబ్జీ ఫిట్స్ క్లినిక్‌ను ప్రారంభించారు. అలాగే, మూర్ఛ వ్యాధిపై న్యూరోమెడిసిన్ సెమినార్ హాలులో రోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, రంగరాయ వైద్య కళాశాల (ఆర్‌ఎంసీ) వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, న్యూరో మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్‌ఎం షరీఫ్, సైకియాట్రీ హెచ్‌ఓడీ డాక్టర్ రామచంద్రరావు, మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సతీష్ శ్రీనివాస్, న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవితేజ పాల్గొన్నారు.

ఇవీ లక్షణాలు

- ఉన్నట్టుండి స్పృహ కోల్పోవడం.
- మానసిక స్థితిలో అసాధారణ మార్పులు.
- అసాధారణ వణుకు.
- తదేకంగా చూడటం, దృష్టిలో మార్పు. కళ్లు ఆకాశం వైపు చూడడం.
- కండరాలు మెలితిప్పిన, కుదిపిన అనుభూతి.
- పెదవి కొరకడం లేదా నమలడం.
- తాత్కాలిక గందరగోళం, మందగించిన ఆలోచన.
- మాట్లాడటం, మాట్లాడింది అర్థం చేసుకోవడంలో సమస్య.
- కడుపు నొప్పి, మూత్ర విసర్జనపై నియంత్రణ కోల్పోవడం.
- చర్మం రంగు పాలిపోవడం.
- శ్వాసలో మార్పులు.
- నాలుక కరుచుకోవడం.
- శరీరం బిగబట్టడం.



మూర్ఛ నియంత్రణపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ లావణ్య కుమారి

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- క్రమం తప్పకుండా మందులు వాడాలి.
- రోజూ కనీసం ఏడు గంటలు నిద్రపోవాలి.
- మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాల వాడకం మానాలి.
- ప్రకాశవంతమైన వెలుగుకు, అతి పెద్ద శబ్దాలకు దూరంగా ఉండాలి.
- ఫిట్స్ వస్తే అవయవాలను బలవంతంగా నియంత్రించకూడదు.
- బాధితుడు నాలుక కరుచుకోకుండా నోట్లో మెత్తటి గుడ్డ చుట్టిన స్పూన్ ఉంచాలి.
- రక్తస్రావం అయి ఆ రక్తం ఊపిరితిత్తుల్లోకి చేరకుండా బాధితుడిని కుడి లేదా ఎడమ వైపు తిప్పి పడుకోబెట్టాలి.
- మూర్ఛ నివారణకు ధ్యానం ఎంతో తోడ్పడుతుంది. ప్రాణాయామం మొత్తం నాడీ వ్యవస్థను నియంత్రిస్తుంది. ఒత్తిడిని దూరం చేస్తుంది.
- ఈ వ్యాధి బాధితులకు ఎటువంటి ఆహార నియమాలూ లేవు.
- డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారి తీయవచ్చు.

జీజీహెచ్‌లో ప్రత్యేక ఫిట్స్ క్లినిక్



సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి సౌజన్యంతో కాకినాడ జీజీహెచ్‌లో మూర్ఛ వ్యాధిగ్రస్తుల వైద్య సేవల కోసం ప్రత్యేక క్లినిక్ ఏర్పాటు చేశాం. ఇక్కడ ప్రతి శనివారం పూర్తి ఉచితంగా ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయి. మూడో నంబర్ ఓపీలో న్యూరాలజీ నిపుణులు ప్రతి శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అందుబాటులో ఉంటారు. ఉచిత మందులు, వైద్య పరీక్షలు చేస్తాం. మూర్ఛ వ్యాధితో బాధితులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఎస్‌ఎం షరీఫ్, ఇన్‌చార్జి హెచ్‌ఓడీ, న్యూరాలజీ, ఆర్‌ఎంసీ, కాకినాడ

మూర్ఛ ప్రేరేపితాలు

న్యూరాలజీ నిపుణుడిని సంప్రదించి మూర్ఛ నియంత్రణకు మందులు వాడినప్పటికీ కొన్ని ప్రేరేపితాల వల్ల ఫిట్స్ సంభవించే అవకాశం ఉంటుంది. అవి నిద్ర లేమి, అతిగా అలసిపోవడం, ధూమపానం, మద్యపానం, మద్యం ఉపసంహరణ, మాదకద్రవ్యాల వినియోగం, హార్మోన్ల మార్పులు, అనారోగ్యం, తీవ్ర జ్వరం, శారీరక అధిక శ్రమ, పోషకాహార లోపం, కెఫీన్ వినియోగం అధికంగా ఉండడం, డీహైడ్రేషన్, అలర్జీలకు వాడే కొన్ని రకాల మందులు. వీటిని ఎపిలెప్సీ ట్రిగ్గర్లు అని అంటారు.

– డాక్టర్ ఆర్.గౌతమ్ ప్రవీణ్, ప్రముఖ న్యూరాలజీ నిపుణుడు, కాకినాడ

'కంపార్టుమెంటు'తో సత్ఫలితాలు

- లక్ష మంది వచ్చినా సాఫీగా సత్యదేవుని దర్శనం
- ఇకపై కూడా ఇదే విధానం



కంపార్టుమెంట్లలో దర్శనానికి వేచియున్న భక్తులు

అన్నవరం: కార్తిక మాసంలో సోమవారం, ఏకాదశి, ద్వాదశి, పౌర్ణమి వంటి పర్వదినాల్లో లక్షలాదిగా వచ్చే భక్తులు సత్యదేవుని దర్శించుకోవడానికి గతంలో చాలా ఇబ్బందులు పడేవారు. క్యూలోకి వెళ్లేందుకు, స్వామివారి దర్శనం క్యూలోను గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. 2022 కార్తిక పౌర్ణమి నాడు భక్తులను అదుపు చేయలేక సుమారు గంట పాటు పశ్చిమ రాజగోపురం తలుపులు మూసేశారు. గత ఏడాది కార్తిక పౌర్ణమి నాడు గంటల తరబడి రాజగోపురం వద్దనే నిలిపివేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈసారి కార్తిక పౌర్ణమికి అధికారులు టీటీడీ మాదిరిగా కంపార్టుమెంట్లు ఏర్పాటు చేసి, భక్తులను నియంత్రించారు. అందులో కూడా వారు కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. పశ్చిమ రాజగోపురం ముందు విశ్రాంతి షెడ్డులో ఒకటి, రాజగోపురం ముందు రోడ్డు మీద ఒకటి, రాజగోపురం వద్ద మరొకటి చొప్పున కంపార్టుమెంట్లు ఏర్పాటు చేశారు. రాజగోపురం దాటి లోపలకు వచ్చాక నేరుగా క్యూలైన్‌లోకి, అక్కడి నుంచి వ్రత మండపాల ఎదురుగా నిర్మించిన క్యూ కాంప్లెక్స్‌లోకి భక్తులు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. దీంతో సుమారు రెండు గంటల వ్యవధిలోనే సత్యదేవుని దర్శనం జరగడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం కూడా కంపార్టుమెంటు ద్వారానే భక్తులకు దర్శనాలు కల్పించారు. ఇదే విధానాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ తెలిపారు.

అప్పుల సాకులు మాని.. హామీలు అమలు చేయండి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కాకినాడ సిటీ: అప్పులు సాకులుగా చెప్పడం మాని, తమకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అంగన్‌వాడీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చాలనే డిమాండుతో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. 42 రోజుల సమ్మె ఒప్పందాన్ని అమలు చేయాలని, మెయిన్ వర్కర్లతో సమానంగా మినీ వర్కర్లకు కూడా వేతనాలు, ప్రమోషన్లు, వేసవి సెలవులు ఇవ్వాలని నినదించారు.

ధర్నానుద్దేశించి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మ, ఏరుబండి చంద్రావతి ప్రసంగించారు. అంగన్‌వాడీ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా 42 రోజుల పాటు నిర్వహించిన సమ్మె ముగిసి ఎనిమిది నెలలు గడిచాయని, ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన ఒప్పందం మేరకు ఏ ఒక్క డిమాండునూ నెరవేర్చలేదని అన్నారు. 300 కుటుంబాలకు ఒక మినీ సెంటర్ ఉండాల్సి ఉండగా 1,500 కుటుంబాలకు కూడా వీటిని నిర్వహిస్తున్నారన్నారు. మినీ సెంటర్ల వర్కర్లతో బానిసలకంటే దారుణంగా పని చేయిస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సైతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 42 రోజుల సమ్మె ఒప్పందం అమలుకు దశల వారీ పోరాటాలకు అంగన్‌వాడీ కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ధర్నాకు సీఐటీయూ నాయకులు చంద్రమళ్ల పద్మ, నర్ల ఈశ్వరి, కె.సత్తిరాజు, చెక్కల రాజ్‌కుమార్ తదితరులు మద్దతు తెలిపారు.

ఆహారం.. ఆరోగ్యం


కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


ఎరువుల తయారీలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పాడి-పంట

- ప్రకృతి సాగుతో మేలైన ఉత్పత్తులు
- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- క్రమేపీ పెరుగుతున్న సాగు విస్తీర్ణం

కొత్తపేట: జీవన శైలి మారింది.. ఆహార అలవాట్లు మారాయి.. దీనికి తోడు అనారోగ్య సమస్యలూ అధికమయ్యాయి. మనం తీసుకునే ఆహారాన్ని అధిక ఎరువులు, పురుగు మందులతో సాగు చేయడంతో వ్యాధుల కారకంగా మారుతున్నాయి.. ఈ నేపథ్యంలో ప్రకృతి సాగుకు ప్రాధాన్యం పెరిగింది. వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో రసాయన రహిత విధానాలకు ఆదరణ వచ్చింది. దీనిపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఆ మేరకు అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. సేంద్రియ ఎరువులు, చీడపీడల నివారణకు వినియోగించే కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో 1,03,251 మంది రైతులు ఉన్నారు. వీరు మొత్తం 1,06,030 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. 50 శాతం మంది పూర్తిగా రసాయనిక, పురుగు మందులను వినియోగిస్తున్నారు. మరో సగం మంది ప్రకృతి వ్యవసాయ విధానంతో పాటు రసాయన ఎరువులను వాడుతున్నారు. మూడు జిల్లాల్లో పూర్తిగా ప్రకృతి సేద్యాన్ని 21,417 ఎకరాల్లో 20,983 మంది రైతులు చేస్తున్నారు. దీనివల్ల పెట్టుబడి గణనీయంగా తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. ఉదాహరణకు రసాయనిక సాగులో ఎరువులు, పురుగు మందులకు సుమారు రూ.15 వేలు ఖర్చయితే.. ప్రకృతి వ్యవసాయంలో సుమారు రూ.4 వేలు మాత్రమే అవుతోంది.

డాక్టర్ వైఎస్ హయాంలోనే..

ప్రకృతి వ్యవసాయ విభాగం 2008లో ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో పురుడు పోసుకుంది. ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తులను పండించేలా రైతులను చైతన్యవంతులను చేయాలనే లక్ష్యంతో అప్పట్లో నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ (ఎన్‌పీఎం) ఆవిర్భవించింది. 2015లో రైతు సాధికార సంస్థగా మారి, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ (పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం- జెడ్‌బీఎన్ఎఫ్)గా మార్పు చెందింది. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ సంస్థను మరిన్ని సౌకర్యాలు, ప్రయోజనకర పథకాలతో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్)గా అభివృద్ధి చేసింది. క్షేత్ర స్థాయిలో ప్రకృతి సేద్యం పట్ల రైతులను చైతన్యవంతులను చేయడానికి మెంటర్లు, ఫార్మర్ సైంటిస్టులు, మోడల్ మేకర్‌లను తయారు చేయడానికి 2022లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కడప జిల్లా పులివెందులలో ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఆగ్రో ఎకోలజీ అండ్ రీసర్చ్ అండ్ లెర్నింగ్ (ఐజీజీఏఏఆర్ఎల్)ను ఏర్పాటు చేసింది.

సహజ ఎరువులు, కషాయాలతోనే...

ప్రకృతి సాగుకు సహజంగా లభించే పదార్థాలు, ద్రవాలతో తయారు చేసిన ఎరువులు, క్రిమిసంహారక కషాయాలను వినియోగిస్తున్నారు. రసాయనిక ఎరువుల కంటే ఇవి తక్కువ ఖర్చు అవుతోంది. ఆవు పేడ, గోమూత్రం, బెల్లం, శెనగపిండి వంటి పదార్థాలతో ఘన, ద్రవ, జీవామృతం తయారు చేస్తున్నారు. పంటలపై ఆశించే పురుగులు, చీడపీడల నివారణకు పురుగు మందుల స్థానంలో నీటిని కలిపి తయారు చేసిన ద్రవ జీవామృతాన్ని వినియోగిస్తున్నారు. వరిలో అగ్గి తెగులు, సుడిదోమ, వైరస్ నివారణకు పేడ కషాయం, పురుగుల నివారణకు అగ్నిఅస్త్రం వంటి కషాయాలను వినియోగిస్తున్నారు. ప్రకృతి సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. ఆకుకూరలు, కూరగాయలు, బొప్పాయి, అరటి, వరి తదితర పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్నారు.

పచ్చదనం నింపేందుకు..



సాగు భూముల్లో 365 రోజులు ఏదో ఒక వ్యవసాయ, ఉద్యాన పంటలతో పచ్చదనం కొనసాగడమే ప్రకృతి వ్యవసాయ విభాగం లక్ష్యం. క్రమేపి రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించి, ఘన, ద్రవ, కషాయాల ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి రైతులూ ప్రాధాన్యం ఇస్తున్నారు.

–జి.ఎలియాజర్,
జిల్లా ప్రాజెక్టు మేనేజర్, ప్రకృతి వ్యవసాయం

చైతన్యవంతులను చేస్తున్నాం



ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చు. జీవన ఎరువులు, కషాయాలు తయారీపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. రైతులను చైతన్యవంతులను చేస్తున్నాం. ప్రతి ఏడాదీ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రకృతి సేద్యంలో పండించిన ఉత్పత్తుల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

–కముజు అరుణకుమారి,
ఫార్మర్ సైంటిస్టు, బిళ్లకుర్రు

శ్రీనివాసా.. శ్రీవేంకటేశా


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి


ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

- భక్తులతో పోటెత్తిన వాడపల్లి

ఆత్రేయపురం: గోవిందా.. హరి గోవిందా నామస్మరణ మార్మోగింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం కార్తిక మాసం శనివారం సందర్భంగా కిక్కిరిసింది. ఉదయం స్వామివారిని వేదపండితులు, అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. తొలుత సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర పూజాదికాలు చేశారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు కాలినడకన వచ్చారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో వేలాది మందికి అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 45 వేల నుంచి 50 వేల మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా మధ్యాహ్నం 3 గంటల వరకూ సుమారు రూ.36,66449 ఆదాయం సమకూరింది. దేవదాయ ధర్మదాయ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్య చక్రధర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయం, ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి రద్దీ నెలకొంది. ఎస్సై ఎస్.రాము ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

పెరవలి: ఓ ప్రైవేట్ ట్రావెల్‌బస్సు ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు పెరవలి ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నల్లాకుల వారిపాలేనికి చెందిన నల్లాకుల వెంకట నర్సయ్య (48) టీ తాగటానికి అక్కడి జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా తణుకు నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న మైత్రీ ట్రావెల్ బస్సు ఢీకొంది. దీంతో వెంకట నర్సయ్య ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి వచ్చిన భార్య కనకదుర్గ, పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించారు.

బాలికపై లైంగిక దాడి

చాగల్లు: తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం దారవరం గ్రామంలో ఓ బాలిక (14)పై వరుసకు మేనమామ అయిన యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ.. భర్తతో మనస్పర్థలు రావడంతో బాలిక తల్లి ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లింది. దీంతో ఆ బాలిక పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెంలో అమ్మమ్మ వద్ద బంధువుల సంరక్షణలో ఉండి, నిడదవోలు మండలం సమిశ్రగూడెంలోని బాలికల వసతి గృహంలో చదువుకుంటోంది. ఆ బాలిక ఆధార్ కార్డులో మార్పుల కోసం పట్టిపాలెం తీసుకుని వెళ్లేందుకు అదే గ్రామానికి చెందిన వరుసకు మేనమామ అయిన సనమండ్ర కమల్ ఈ నెల 14న ఆ బాలిక వద్దకు వెళ్లాడు. బాలికను తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని పట్టింపాలెం కాకుండా చాగల్లు మండలం దారవరంలోని తన అమ్మమ్మ ఇంటికి తీసుకుని వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బాలికపై కుమార్ లైంగిక దాడి చేశాడు. విషయం ఎవరికైనా చెపితే చంపేస్తానని బెదిరించాడు. అనంతరం అక్కడి నుంచి పట్టిపాలెం వెళ్లారు. అక్కడ కడుపు నొప్పి రావడంతో బాలిక తన అమ్మమ్మకు దారవరంలో జరిగిన లైంగిక దాడి గురించి చెప్పింది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. బాధిత బాలికను పోలీసులు శుక్రవారం నిడదవోలు ప్రభుత్వాస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం తరలించారు. లైంగిక దాడికి పాల్పడిన కమల్‌పై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కె.నరేంద్ర తెలిపారు.

క్లుప్తంగా

24 నుంచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

అమలాపురం టౌన్: కాట్రేనికోన మండలం చిలకమ్మ చెరువు గ్రామంలో ఈ నెల 24, 25 తేదీల్లో డే అండ్ నైట్ ఫ్రెండ్స్ స్టేట్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు స్టేట్ వాలీబాల్ క్రీడాకారుడు, టోర్నమెంట్ నిర్వాహకుడు మోర్తా ప్రతిష్ఠ తెలిపారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టోర్నమెంట్ సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి జిల్లా స్థాయి జట్లు ఇక్కడకు వచ్చి రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటనున్నాయని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు, షీల్డ్‌లు అందజేస్తామని వివరించారు. రెండు రోజులపాటు జరిగే ఈ క్రీడా సంబరాల్లో క్రీడాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అండర్–19 హాకీ పోటీలు ప్రారంభం


అంతర్ జిల్లాల హాకీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో అండర్–19 ఎస్‌జీఎఫ్‌ఐ అంతర్ జిల్లాల హాకీ పోటీలు శనివారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–14, 17 జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.జార్జి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. అనంతరం హోరాహోరీగా పోటీలు జరిగాయి. గౌరవ అతిథిగా డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, డీవైఈఓ ఎన్.వెంకటేశ్వరరావు, ఎస్‌జీఎఫ్‌ఐ సంయుక్త కార్యదర్శులు సునీల్, పరశురాం, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, సూరిబాబు, సురేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

చర్చి, పాకల కూల్చివేత


రాజుపాలెంలో కూల్చివేసిన పాకలను పరిశీలిస్తున్న అనపర్తి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- రాజుపాలెంలో దారుణం
- ప్రభుత్వ కక్ష సాధింపేనని బాధితుల ఆరోపణ

పెదపూడి: కూటమి సర్కార్ అరాచక పాలన కొనసాగుతూనే ఉంది. కాకినాడ జిల్లా పెదపూడి మండలం రాజుపాలెం గ్రామంలో 3 పశువుల పాకలను, ఒక చర్చిని అధికారులు కూల్చివేశారు. పశువుల పాకల యజమానులు కర్రి చంద్రరావు, నల్లా వీర వెంకట రమణ, గంజా సూర్యానారాయణ, చర్చి ప్రతినిధి గంపల ఆనందబాబు, గ్రామ మాజీ సర్పంచ్ నాగుమళ్ల వీరభద్రరావు ఈ వివరాలను మీడియాకు తెలిపారు. గ్రామంలో తామంతా 50 ఏళ్లుగా పశువుల పాకలు వేసుకుని సుమారు 20 నుంచి 30 పశువులను మేపుతున్నామని చెప్పారు. అలాగే చర్చి కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఆ స్థలాలకు ప్రభుత్వం నుంచి చాలా కాలం కిందటే పట్టాలు పొందామని, పన్నులు చెల్లిస్తున్నామని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తాము వైఎస్సార్ సీపీ సానుభూతి పరులమంటూ.. ఎటువంటి కారణం చెప్పకుండా, ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఆర్అండ్‌బీ ఏఈ బి.లోవరాజు, తహసీల్దార్ సీతాపతి పోలీసులు కలిసి సుమారు 30 మంది అధికారులు శనివారం ఉదయం 5 గంటలకే వచ్చారని చెప్పారు. జేసీబీతో పాకలను, చర్చిని ఒక్కసారిగా నేలమట్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మూగజీవాలను బయటకు తీసుకురాక ముందే దౌర్జన్యంగా పాకలు, చర్చిని కూల్చివేశారని చెప్పారు. కేవలం కూటమి సర్కారు కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ దారుణానికి ఒడిగట్టారన్నారు. కాగా, నిబంధనల ప్రకారమే ఆక్రమణలు తొలగించామని ఆర్అండ్‌బీ ఏఈ లోవరాజు సమాధానమిచ్చారు.

పెచ్చుమీరిన దౌర్జన్యాలు : కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలు పెచ్చుమీరాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మండిపడ్డారు. రాజుపాలెంలో తొలగించిన పశువుల పాకలు, చర్చి ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేస్తున్న దౌర్జన్యాలకు ఇది మరో నిదర్శనమన్నారు. పేదలు సుమారు 50 ఏళ్లుగా పాకలు వేసుకుని పశువులను మేపుతున్నారన్నారు. వారికి గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టా ఉందని, పన్ను చెల్లిస్తున్నారన్నారు. దీనికి అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించడం అన్యాయమన్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతి పరులను ఇబ్బంది పాల్జేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఏవిధంగా దౌర్జన్యకాండను ప్రోత్సహిస్తున్నారో అంతా చూస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో దీని ఫలితాన్ని వారు చూస్తారని హెచ్చరించారు. పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, నాయకుడు సుందరపల్లి వీరభద్రం తదితరులు ఉన్నారు.

విమానాశ్రయం మాకొద్దు

భూములు ఇచ్చేది లేదన్న రైతులు


మాజీ మంత్రి యనమలకు వినతిపత్రం అందజేసిన విమానాశ్రయ వ్యతిరేక రైతు సంఘం ప్రతినిధులు

తుని రూరల్: తమ గ్రామాల్లో విమానాశ్రయం వద్దని, భూములు ఇచ్చేదిలేదని అన్నవరం, బెండపూడి, పీఈ చిన్నయ్యపాలెం గ్రామాలకు చెందిన రైతులు తేల్చిచెప్పారు. ఈ మూడు గ్రామాలకు చెందిన రైతులు సంఘంగా ఏర్పడి శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడికి వినతిపత్రం అందజేశారు. తుని మండలం తేటగుంటలోని తన క్యాంపు కార్యాలయంలో యనమలను రైతులతో పోరాట సమితి ప్రతినిధులు కలసి తమ సమస్యలను లిఖిత పూర్వకంగా తెలిపారు. పుష్కర కాలువ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ, 16వ నంబరు జాతీయ రహదారి విస్తరణకు తమ భూములను ఇప్పటికే ఇచ్చామన్నారు. ఈ గ్రామాల్లో ఎకరా, అరెకరా భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు జీవనం సాగిస్తున్నట్టు పేర్కొన్నారు. విమానాశ్రయానికి భూ సేకరణ పేరుతో ఉన్న కాస్త భూములను లాగేసుకుంటే తాము జీవించేది ఎలాగని వాపోయారు. రైతులు, రైతు కూలీల జీవనాధారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. విమానాశ్రయం వద్దని, తమ జీవనాధారమైన భూములను ఇవ్వబోమని రైతులు పేర్కొన్నారు. రైతుల డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తానని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు హామీ ఇచ్చినట్టు రైతు ప్రతినిధులు తెలిపారు. మాజీ సర్పంచ్ సాధనాల నూకరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు కొంగర విశాలాక్షి, గొంతిన వరలక్ష్మి, రైతు సంఘ అధ్యక్షుడు పాలచర్ల భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి రాయవరపు ఆనంద్, ఉపాధ్యక్షుడు గొంతిన నాగేశ్వరరావు, తంగేళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్


గోపాలపురంలో నిందితులు, నగదును చూపుతున్న సీఐ, పోలీసులు

గోపాలపురం: మండలంలోని దొండపూడి పంచాయతీ పరిధి సాగిపాడు గ్రామంలో ఈ నెల 2న తల్లీ కుమార్తెలను కట్టేసి దాడి చేసి, తర్వాత దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులను శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ బి.నాగేశ్వర్ నాయక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సాగిపాడు గ్రామ శివారులోని ఇంట్లో మిడిపాటి శారద, ఆమె తల్లి గరిమెళ్ల సూర్యకాంతం ఉండగా ఇద్దరు వ్యక్తులు ముసుగులు ధరించి ఇంట్లోకి ప్రవేశించారు. ఇనుపరాడ్లతో వచ్చిన వారు తల్లీకుమార్తెల తలలు, చేతులపైనా విచక్షణా రహితంగా దాడిచేశారు. వారి నుంచి 40 కాసుల బంగారం, వెండి ఆభరణాలు, రూ.3.50 లక్షలు దోచుకుపోయారు. ఈ ఘటనలో నిందితులు కామవరపుకోట మండలం కొండగూడేనికి చెందిన చీకట్ల సతీష్, రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరుకు చెందిన షేక్ అబ్దుల్ బాదుల్లా షరీఫ్, వీరికి సహకరించిన గోపాలపురం మండలం తొక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నక్కా కిశోర్‌బాబులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.2.70 లక్షలు, 40 కాసుల బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసు ఛేదించిన ఎస్సై కర్రి సతీష్‌కుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.

ట్రాక్టర్ బోల్తా: వ్యక్తి మృతి

రౌతులపూడి: ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బంగారయ్యపేట గ్రామానికి చెందిన పబ్బిరెడ్డి శ్రీను (40) శనివారం ఉదయం గ్రామ శివారున ఉన్న ఇటుకుల బట్టీలో మట్టిని దమ్ము చేసే పనికి వెళ్లాడు. ట్రాక్టర్‌తో మట్టిని శ్రీను దమ్ము చేస్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. మట్టిలో కూరుకుపోయిన శ్రీను ఛాతిపై ట్రాక్టర్ పడి ఊపిరి ఆడకపోవటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తామని రౌతులపూడి ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కోటనందూరు: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. తుని మండలం ఎస్.వెంకటనగరం గ్రామానికి చెందిన కోరకంటి విమల (22) స్థానిక రెయిన్‌బో ఫ్యాషన్ బొటిక్ లేడీస్ టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ పొందుతుంది. రోజూ మాదిరిగానే శుక్రవారం శిక్షణకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె తండ్రి సింహాచలం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆధ్యాత్మికత నింపేందుకు చండీ హోమం


ఆదిత్య యూనివర్సిటీలో చండీ యాగం చేస్తున్న వైస్ చైర్మన్ దంపతులు

గండేపల్లి: విద్యార్థులకు విద్యతో పాటు ఆధ్యాత్మికత పెంచేందుకు చండీ యాగం వంటి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆదిత్య యూనివర్సిటీ వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఐదు రోజుల పాటు నిర్వహించిన సహస్ర చండీ యాగం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమన్నారు. అందుకుగాను వ్యక్తిత్వ వికాస తరగతులు, దైవభక్తిని నింపే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హిందూ సంప్రదాయం ప్రకారం చండీ యాగాన్ని ఆదిత్య యాజమాన్యం నిర్వహించింది. కార్యక్రమంలో ఆదిత్య సిబ్బంది, విద్యార్థులు, వివిధ గ్రామాల భక్తులు తరలివచ్చారు.